# పరివర్తన

శ్రీమతి వట్టి అమ్మాజీగారు

"ఈ రోజున సినీమాయేనా?"

"కాదు ............"

"ఎక్కడకు వెళ్లేది తెల్సుకోనరాదా?"

"ఎందుకని?"

"నా పట్ల ఇంత విముఖత ఏల?"

"....................."

"నే చేసిన అపరాధమేముంది!"

"వాగకు...చీకాకు..............."

రాత్రి నిశ్శబ్దంలో ఈ మాటలు రాధ వింది. ఆమె కళ్లవెంట అప్రయత్నంగా నీళ్లు కారాయి. ఆమె మణి గదివేపుకు పోయి చూచింది. మణి గవాక్షంకడ నిల్చొని ఏడుస్తోంది. రాధ తన గదికిపోయి దుఃఖించింది. ప్రక్క గదిలోని గడియారం ఒంటిగంట కొట్టుట రాధ వింది.

మణి కళ్లవెంట నీరు అడ్డులేకుండా ప్రవహిస్తూ ఉంది. ఆవిధంగ ఎంతవరకు వున్నదో ఆమెకు తెలియదు. ఆమె బయల్లోకి చూచింది. దూరానవున్న చెట్లపై ఋషి పక్షులు స్వేచ్ఛగా యెగురుతున్నాయ్. చేల్లో కుప్పలునూర్చే పనివాళ్ల పాటలు ఆశీతల వాయువుల్లో గంభీరముగా విన వస్తున్నాయ్. మణి నిట్టూర్పు విడిచింది. ఆమె గదిలోనికిపోయి దీపము ఆర్పి వసారాలో నిలచింది. రాత్రి కృష్ణవచ్చే సరికి మణి వసారాలో అలాగే నిల్చుంది. అతను విసురుగాను, నిర్లక్ష్యంగాను గదిలోకి పోయాడు. ఆమె సాలోచితంగా ఆకాశంవేపు చూచింది. నేత్రాలువిచార పూరితాలయ్యాయి. చంద్రుడు మేఘాలుచాటున దాగున్నప్పుడు కూడా ఆమె విశాల నేత్రాలు తారల్లా మెరిసిపోతున్నవి. గాలికి కేశ కుంతలాలు ఆమె ఫాలభాగంపైబడి ముఖానికదో విథమైన సొగసును కూరుస్తున్నయ్. మణి వెనక్కు తిరిగి చూచింది. లోపల లైటువెల్గు గవాక్షంగుండా బయటికి ప్రసరిస్తోంది. మణి గవాక్షంగుండా లోనికి చూచింది. కృష్ణ సోఫాలో కూర్చున్నాడు. అతని సామీప్యానికి పోవాలని ప్రయత్నించింది.

"నా ఎడింత విముఖత కల్గున్నప్పుడు నే నేలపోవాలి!" అభిమానవతైన మణి ఆ ప్రయత్నం విరమించుకోంది. ఆమె తన గదిలోనికి పోయింది. మణి చాలాసార్లు తన పుట్టింటకు పోవలెనని ఆలోచించింది కానీ, తానా విధముగ పోవుట సమంజసము కాదనుకోంది. నారీ హృదయంకష్టాలు సహించటానికే విధాత సృజించాడు! మణి వచ్చి చాలా దినాలైంది. తల్లితండ్రులు చాలామార్లు పిలిచారు కానీ ఆమె పోలేక పోయింది. ఇప్పుడో! ఆమె పుట్టింటకు పోవాలని నిశ్చయించింది. అందుకు ప్రయాణసరంజామా చేసికొన్నది. ఈ సంగతి రాధతో చెప్పిపోవాలని నిశ్చయించింది. తను ఏ విషయంలోనైనా రాధ సలహా తీసుకొంటేనేగాని ఏ పని చేయదు. ఆ ఇంట్లోకల్లా తనశ్రేయం కోరేది రాధ ఒక్కటే. తన కష్టసుఖాలు రాధతోనే చెప్పుకోవాలి. తనను ప్రేమించినా, ఆదరించినా రాధయే. తనను తల్లిలా సాకుతుంది.

రాధకు పెండ్లై అత్తింటికిపోతే ఆ ఇంట్లో తన్నిక ఆదరించే వారెవరు! ఈ విషయం తల్చుకొనేటప్పటికి మణికపరిమితమైన దుఃఖంవచ్చింది. ఆమె రాధ గదివేపుకి చూచింది. అప్పుడే రాధ తనగదినుండి వచ్చింది. మణి కళ్లల్లోని అశ్రువులు రాధ హృదయాన్ని గాయపర్చినవి. రాధ మణిని కౌగిలించుకొని ఓదార్చింది. మణి అశ్రువులు తుడుచుకొని తన ప్రయాణం సంగతి చెప్పింది.

రాధ ఆవేగంతో "పోవద్దు వదినా! నే నెంత మాత్రం సహించలేను," అంది.

"కృష్ణ ఉన్నాడా?" అని రాధ ఆమెను అడిగింది.

మణి వుండెనన్నట్లుగ తలూపింది.

రాధ కృష్ణ గది వంకకు పోయి చూచింది. అన్న ఇంత రాత్రివరకు టెలిఫోనులో సంభాషించుట రాధకు ఆశ్చర్యం

కల్లకపోలా! మాటలు నెమ్మదిగ వింది. లీల ఎవరు ? రాధకు విస్మయం కల్గింది. ఆమె మణిని పడుకోమని చెప్పి తన గదిలోకి పోయింది.

అగాధమైన బయల్లోకి శూన్యదృక్కుల్ని ప్రసరింపచేస్తూ రాధ పరిస్థితిని ఆలోచించ సాగింది. కృష్ణ ప్రవర్తనలో అనేక మార్పులు వచ్చాయ్.

అతను బయట ఎల్లా కాలం గడుపుతున్నాడో మణికి తెలీదు. అసలు మణికి తెల్సుకోవాలనే ఉద్దేశమేలేదు. అతను ఏంచేస్తున్నా పరాయివ్యక్తిలా సంచరించడం ఒక్కటే మణి చెయ్యకల్గింది. అతనితో ముభావంగా వుండటం అలవాటు చేసికున్నది. అల్లా ఆమెలో ఎంత సహనముందీ రాధకు తెల్సు. మణి స్థితిని తల్చుకొన్న కొద్ది భరింపరాని దుఃఖము తన హృదయంలో పొంగిపొర్లింది. ఏ విధంగానైనా అన్న ప్రవర్తన మారితే మణి జీవితం బాగుపడునని రాధ ఊహించింది. కానీ కర్తవ్యం! ఈ సంగతామెను కల్లోల పరచింది. ఉదయం రాధ కిటికీ తెరుస్తూ బయటకు చూచి నప్పుడు సుధ జ్ఞాపకంవచ్చింది. ఆమె వెంటనే హాల్లోకిపోయి టెలిఫోను రిసీవరును తీసి సుధను పిల్చింది.

"రాధా! కుశలమా!"

"సుధా! లీల......"

ఈ మాటలు పూర్తి చెయ్యకముందే సుధ లీలను గూర్చి చెప్పింది. ఊపిరి పీల్చుకోకుండా వింది రాధ. ఆమె శరీరం క్రోధంతో వణికింది. లీల ఇంత అవనీతిగా ప్రవర్తిస్తోందా! ఒక కాలేజిలో చదువుకొని స్నేహితులమై......ఛీ లీలా! మణి జీవితం నాశన మొనర్చుటకా!

ఆ రోజున రాధ అన్నగారికి ఎన్నో నీతులు గరిపింది. కాని వినిపించుకోలా.

కృష్ణ సిటీవాస్తవ్యుడు. సిటీ పాలీష్, సిటీ ఎడ్యుకేషన్, సినీమా ఫేషన్స్, ఇవి అతని అభిరుచులు. ఇక మణి అంటే పల్లెటూరి మనిషి. ఇవంటే మణి ఇష్టపడదు. కట్నానికి ఆశించైతేనేమి, తండ్రికి జడిసి అయితేనేమి మణిని వివాహమాడాడు. మణి అందమైనదే. కొద్దో గొప్పో చదువుకుందే. కానీ ఇద్దరి అభిమతాల్కే భేదముంది. లీల అనగా కాలేజి విద్యార్థిని. సిటీ పాలీష్, సినీమా ఫేషన్స్, ఆమెవి. ఆమె కుత్రిమ వేషాల్కే కృష్ణ లోనయ్యాడు. ఇప్పుడతనిలో అనేక మార్పులు వచ్చినవి. లీలదగ్గరే రాత్రింబవళ్లుగడ్పుతున్నాడు. రాధ సర్వమూ తెలిసికున్నది. అన్న ప్రవర్తన మార్చేందుకు ఏమైనా సాధనాలున్నాయోమో నని వెతకటమే ఆమె పనైంది.

ఇప్పుడు రాధ పట్టుదలమీద మణి బాగా చదువుకుంది. అన్ని విషయాల్లోను మునుపటికంటె ఎక్కువ నేర్చుకున్నది. రాధ లీలనుగూర్చి ఎప్పటికప్పుడే తెల్సుకొంటుంది సుధవల్ల.

అక్కడ లీల సినీమాలో అభినయించుట కుత్సాహపడు తుందని కృష్ణ ఇందుకు ఇష్టపడడని దీన్నిగురించైనా వాళ్ల మైత్రికి భంగముకలుగ వచ్చునని, సుధ చెప్పింది. రాధ ఉత్సాహంతో ఈ మాట మణికిచెప్పింది.

అక్కడ కృష్ణకు లీలకు మైత్రిపీడి పోయింది. ఇప్పుడు ఆమె మరో స్నేహితునితో సినీమాలో నటించింది. కృష్ణకు ఒక్కసారిగ తన హీనస్థితి అంతా తెల్సిపోయింది. పశ్చాత్తాపంతో బాధపడ్డాడు. జరిగిన అవమానానికి మండి పోతు న్నాడు. నిష్కారణముగ మణిని కష్టపెట్టినందుకు మానసిక వేదనపొందాడు. దేబె ముఖంతో ఇల్లు పట్టాడు. అతని హృదయం అనేక బాధలతో కొట్టుకొంటోంది. లీల దుష్ప్రవర్తన, మణి నిష్కళంకప్రేమ, సోదరి నీతి బోధనలు, ఇవన్నీ అతని హృదయాన్ని కలచి వేసాయి.

రాధ సర్వం తెల్సుకుంది. అన్న దగ్గరకు వెళ్లింది. రాధను వేడుకొన్నాడు, క్షమింపమని. రాధ అన్నను మణి దగ్గరకు తీసుకువెళ్లింది. కృష్ణ మణినిచూచి అద్భుతపడ్డాడు. అప్పుడు తెల్సుకున్నాడు ప్రేమవిలువ! మణి ఆరాధ్య దేవతయని భావించాడు. ఇదంతా తన సోదరి నేర్పరితనమే అనుకొన్నాడు. రాధను అభినందించాడు. ఇప్పుడు రాధ హృదయము కుదుట పడింది.